ప్రజాశక్తి
గురువారం 26 జూన్ 2025
5
పార్వతీపురం మన్యం

డిడిఆర్ ఎఫ్‌ఒగా సింహాచలం

పార్వతీపురం : జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారిగా పి.సింహాచలం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌ను కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో విపత్తులు, వరదల సమయంలో అప్రమత్తం గా ఉండాలని కలెక్టర్ సూచిం చారు. జిల్లాలో గల నాలుగు అగ్నిమాపక కేంద్రాల పరిస్థితి, సిబ్బంది, మౌలిక సదుపాయాలను గూర్చి ఆరా తీశారు.

కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న డిడిఆర్ సింహాచలం

లేబర్ కోడ్‌లు రద్దయ్యేంత వరకూ పోరాటం

- 9న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి
- జీపు యాత్రలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పిలుపు

ప్రజాశక్తి - పాలకొండ

కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లు రద్దయ్యేంత వరకూ పోరాటాలు ఆగదని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పి.తేజేశ్వరరావు అన్నారు. జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జీపు యాత్ర ప్రారంభ సభ స్థానిక పాత బస్టాండ్ ఆవరణలో సిఐటియు నాయకులు బి.అమరవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తేజేశ్వరరావు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ఉద్యోగ, రైతు ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నాయన్నారు. కార్పొరేట్లకు అనుకూల విధానాలను అవలంబించి కార్మికులకు నష్టం చేకూర్చే విధానాలు తీసుకొస్తున్నారన్నారని, దీన్ని కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లకు కనీసం వేతనాలు రూ.26వేలు చెల్లించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని, అసంఘటిత కార్మికులకు సమగ్ర శాసన చట్టాన్ని తీసుకురావాలని అన్నారు. ప్రభుత్వరంగాన్ని ప్రైవేటు కన్నా ఆపాలన్నారు. 8 గంటల పని దినాన్ని 12 గంటలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కూడా సరిగ్గా ఇవ్వడం లేదన్నారు. రైతు ప్రభుత్వం అంటూ చెబుతూ బడ్జెట్లో రైతులకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని విమర్శించారు. గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎం.తిరుపతిరావు మాట్లాడుతూ గిరిజనులు ఇప్పటికే అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అయినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం జీపు జాతాను తేజేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించగా, పాత బస్టాండ్ నుంచి అన్న క్యాంటీన్ వరకు ర్యాలీ నిర్వహించారు. పాలకొండలో ప్రారంభమైన జీపు జాతా ఈనెల 27న సాలూరులో ముగుస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై మన్మధరావు, ఉపాధ్యక్షులు వి.ఇందిర, నాయకులు జి.జ్యోతి, కె.గౌరీశ్వరి, హిమప్రభ, కె.రాము, కండాపు ప్రసాదు, జి.శారద, శ్రీదేవి, చిట్టమ్మ, గోవిందరావు, దూషి దుర్గారావు, సురేష్ తదితరులు ఉన్నారు.

సంఘీభావం తెలుపుతున్న కార్మికసంఘాల నాయకులు

సీతంపేట : జులై9న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలా రమణారావు పిలుపునిచ్చారు. స్థానిక బస్టాండ్ వద్ద జీపుయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘటిత కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలి

జిల్లావ్యాప్తంగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెరగాలని, గురువారం జిల్లావ్యాప్తంగా ఎన్రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. డిజిటల్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, విఆర్‌ఒలు, ఉపాధ్యాయులు ఎన్రోల్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొనాలని అన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 4,132 మంది ఒకటో తరగతి విద్యార్థులు తక్కువగా ఉన్నారని, అవన్నీ ఈ డ్రైవ్ ద్వారా భర్తీ కావాలని తేల్చిచెప్పారు. ఇప్పటికే పాఠశాలల్లో చేరి ఆన్‌లైన్ నమోదు కాని వివరాలను రానున్న రెండు రోజుల్లో పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఇందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, డ్రాపౌట్ విద్యార్థులను కూడా బడిలో చేర్పించేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని అన్నారు. బుధవారం తన కార్యాలయ సమావేశ మందిరంలో తల్లికి వందనం కార్యక్రమంపై విద్యా శాఖాధికారులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అత్యుత్తమ విద్యా ప్రమాణాలతో పాటు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. అలాగే ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, షూస్, నోట్ బుక్స్ వంటి కిట్లతో పాటు తల్లికి వందనం, మధ్యాహ్న భోజన పథకం వంటివి ప్రభుత్వం అమలు చేస్తోన్న సంగతిని గుర్తు చేశారు. ఇటువంటి తరుణంలో ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో అడ్మిషన్లు పెరగాలని, ఆ దిశగా తల్లిదండ్రులకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. పాఠశాలలో చేరే ప్రతి విద్యార్థికి పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్ (పెన్) కేటాయించాలని, ఈ నెంబరు ఉంటేనే విద్యార్థి రిజిస్టర్ అయినట్లవుతుందని తెలిపారు. తద్వారా తల్లికి వందనం వర్తిస్తుందని, ఇందుకు అవసరమైన ధ్రువపత్రాలు పొందాలని, లేనిచో వాటికి దరఖాస్తు చేయించి పెన్ పొందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జూలై 1 నాటికి ఈ ప్రక్రియ పూర్తి కావాలన్నారు. సమావేశంలో డిఇఒబి.రాజ్ కుమార్, నోడల్ అధికారి డి.మంజులవాణి, ఐసిడిఎస్ పీడీ టి.కనకదుర్గ, ఎంఇఒలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

నేడు నిషా ముక్త్ భారత్ ర్యాలీ

నిషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని గురువారం జిల్లాలో పెద్ద ఎత్తున చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లో భారీ ఎత్తున నిర్వహించాలని ఆయన ఆదేశించారు. యువత, మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. మాదక ద్రవ్యాలు, మత్తు మందుల జోలికి యువత వెళ్లకుండా అవగాహన కల్పించడంలో భాగంగా చేపట్టడం జరుగుతోందని ఆయన వివరించారు. నిషా ముక్త్ భారత్ కార్యక్రమంపై ర్యాలీని మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహించాలన్నారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం కార్యాలయ సెల్లార్ సమావేశ మందిరంలో సమావేశం జరుగుతుందని ఆయన చెప్పారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న విఆర్‌ఎలు

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

పే స్కేలు అమలు, ప్రమోషన్లు ఇవ్వాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు బుధవారం సిఐటియు ఆధ్వర్యాన జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు వినతిపత్రం అందజేసి, అనంతరం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించాలని, స్థానిక సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. తెలంగాణా మాదిరిగా పే స్కేల్ అమలు చేయాలని, విఆర్‌ఎగా పనిచేస్తున్న వారిని వీఆర్వో ప్రమోషన్ కల్పించాలని, జిల్లాలోని అటెండర్, వాచ్ మెన్, కార్ డ్రైవర్లుగా విఆర్‌ఎలను నియమించాలని కోరారు. కార్యక్రమంలో విఆర్‌ఎ సంఘం జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు, ఉపాధ్యక్షులు ఆర్.సూర్యనారాయణ, కార్యదర్శి జి.కృష్ణారావు, ఉప కార్యదర్శి బి.గోపి, జిల్లా ట్రెజరర్ బి.తిరుపతిరావు, సిఐటియు జిల్లా కోశాధికారి జి వెంకటరమణ, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సన్మానం

వీరఘట్టం : స్థానిక మండల తహశీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన ఎ.సాయికామేశ్వరరావుకు బుధవారం జనసేన నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సంయుక్త కార్యదర్శి జనసేన జానీ, మండల సీనియర్ నాయకులు ఎం.పుండరీకం, పట్టణ జనసేన నాయకులు కె.సాయిపవన్, ఉదయాన ఉదయభాస్కర్, ఎస్.నాగరాజు, బి.కార్తీక్, బి.వినోద్, పి.సాయినాథ్, ఎం.అరవింద, బి.ప్రశాంత్, రమేష్, బాలరాజు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు మెరుగుపడాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని మహిళల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలని, ఆ దిశగా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. మత్స్య సంపద ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని ఆర్జించవచ్చని, ఇందుకు పీఎం మత్స్య సంపద యోజన కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మిషన్ మత్స్యశక్తి, జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్, గిరి బజార్ నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ మత్స్య శక్తి ద్వారా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల మహిళలకు సహాయం అందించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చి, సమాజంలో సమాన భాగస్వాములుగా చేయడానికి ఉద్దేశించిన ఒక సమగ్ర కార్యక్రమమని వివరించారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో మత్స్య సంపద ద్వారా ప్రస్తుతం రూ.479 కోట్లుగా ఉన్న జిడిపిని రూ. 600 కోట్లకు పెరగాలని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. మన్యం ప్రాంతం ఆశావాహ జిల్లా అని, ఇక్కడ కేంద్ర ప్రభుత్వం నిధులు ఎక్కువగా విడుదలయ్యే అవకాశం ఉందని, డిఎ జుగా కింద గుర్తించిన 165 గిరిజన గ్రామాల నుంచి ప్రతిపాదనలు వెళ్లాలని అన్నారు. ఈ పథకం కింద 90 శాతం వరకు సబ్సిడీ పొందవచ్చన్నారు. ఈనెల 30లోగా ప్రతిపాదనలు తమకు సమర్పించాలని కోరారు. మత్స్య సంపద పెరిగేలా అవసరమైన ట్యాంకులను గుర్తించి, కనీసం 100 ఫిష్‌పాండ్లను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతి పాండ్‌లో కనీసం లక్ష ఫ్లింగరింగ్ చేప పిల్లలు ఉత్పత్తి కావాలని, జిల్లావ్యాప్తంగా కోటి చేప పిల్లలు దిగుబడి రావాలని కలెక్టర్ ఉద్బోధించారు. ఫిష్ పాండ్‌ల నిర్వహణను స్వయం సహాయక బృందాలకే అప్పగించాలని చెప్పారు.

జిల్లాలో ఏర్పాటు కాబోతున్న జీడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్ నిర్వహణకు అవసరమైన అన్ని అనుమతులు సిద్ధం కావాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవను కలెక్టర్ ఆదేశించారు. యూనిట్ నిర్వహణలో భాగంగా సిబ్బందికి శిక్షణ తప్పనిసరని సూచించారు. స్వయంగా విడివిగా నిర్వహించుకొనేంత వరకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కలెక్టర్ తేల్చిచెప్పారు. నాణ్యమైన జీడిపప్పును విక్రయించాలని, ఆకర్షణీయమైన ప్యాకింగ్ ఉండాలని అన్నారు. బ్యాచ్ నెం, తయారీ తేదీ, బార్ కోడ్, ధర తదితర వివరాలు ప్యాకింగ్ పై ఉండాలని స్పష్టం చేశారు. గ్రేడింగ్ అయిన తదుపరి వచ్చే జీడిపప్పును కూడా ఇతర ఆహార పదార్థాలకు వినియోగించుకోవచ్చని సూచించారు.

గిరి బజారు వాహనాలను అప్పగించనున్నామని, వాటితో గిరిజన ప్రాంతాల్లో సరుకులను విక్రయించవచ్చని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసే ప్రతి కార్యక్రమం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే లక్ష్యమని, ఆ దిశగా మహిళలు ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. సమావేశంలో ఐటిడిఎ ఎపిఒ ఎ.మురళీధర్, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి, మత్స్యకార అధికారి శ్రీదేవి, జిల్లా పశు సంవర్ధక అధికారి డా. ఎస్.మన్మధరావు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య, ఎల్‌డిఎం ఎన్.విజయ్ స్వరూప్, నాబార్డ్ ఎజిఎం దినేష్, కెవికె శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరాజు, అధికారులు పాల్గొన్నారు.

27న 'సుపరిపాలన'

సుపరిపాలన కార్యక్రమం ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈనెల 27న ఉదయం 10.30 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరు అవుతారనితెలిపారు. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని ఆయన చెప్పారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సూపర్ ఫిఫ్టీ బ్యాచ్‌కు ఎంపిక పరీక్ష

ప్రజాశక్తి - సీతంపేట

ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ ఆదేశాల మేరకు సీతంపేట పరిధిలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు సూపర్ 50 ప్రత్యేక బ్యాచ్ నిర్వహించేందుకు ఎంపిక పరీక్ష స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఈ పరీక్షలో 162 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పరీక్షా కేంద్రాన్ని ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి, రాష్ట్ర పరిశీలకులు టి.శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ అన్నదొర సందర్శించారు. పరీక్షను డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ జి రామ్మోహన్ రావు, ఎఎంఒ కోటిబాబు, సిఎంఒ చిరంజీవిలు, జిసిడిఒ రాములమ్మ, పిఎంఆర్సి కోఆర్డినేటర్ ముకుందరావు, ప్రధానోపాధ్యాయులు చంద్రరావు నిర్వహించారు.

నేడు మెగా నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని సాయి నగర్ సమీపాన శ్రీ సత్య సాయి ఆలయంలో ఈనెల 26న (గురువారం) విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు బుధవారం ప్రకటనలో తెలిపారు. నేత్ర వైద్య శిబిరానికి వచ్చే రోగులు ఆధార్, రేషన్ కార్డులు, బ్యాంకు ఖాతా నెంబరు, ఫోన్ నెంబరు, రెండు జతలు బట్టలు, గ్లాసు, కంచం మొదలగునవి తీసుకురావాలని నిర్వాహకులు కోరారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న

భూములు అప్పజెప్పాలని పేదలు ధర్నా

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ భూములు తమకు అప్పజెప్పాలంటూ మండలంలోని సంత నర్సిపురం పేదలు సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు ఎన్.సింహాచలం మాట్లాడుతూ 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిరుపేదలైన సంత నర్సిపురానికి చెందిన 151 మందికి భూ పంపిణీ చేశారన్నారు. అయితే ఆ భూమి ఎక్కడుందో ఇప్పటికీ లబ్ధిదారులకు చూపించలేదన్నారు. రైతు భరోసా, రుణాలు ఇస్తున్నారని, అయితే ఇప్పటికీ భూమి మాత్రం నిరుపేదలకు అప్పజెప్పలేదన్నారు. సంత నర్సిపురం భూ సమస్యపై ఇటీవల కాలంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలు, వంటా వార్పు చేయడంతో అధికారులు పరిశీలన జరిపి భూమి అప్పచెప్తామని హామీ ఇచ్చారని, అయితే నేటికీ ఆ హామీ నెరవేరలేదన్నారు. సమస్య పరిష్కరించాలని నిరుపేదలైన వారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా కనీసం అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపేదలకు భూములు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నర్సిపురం గ్రామ నిరుపేదలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపిడిఒ బి.వెంకట రమణ అన్నారు. మండలంలోని ఇచ్చాపురంలో బుధవారం ఏర్పాటు చేసిన డిఎ జుగా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో మౌలిక వసతులు కల్పించడం, పిఎం ఉజ్వల్ యోజన, పిఎం జన్మన్‌తో పాటు కుల, ఆదాయ, జనన, మరణ, వివిధ రకాలైన ధ్రువపత్రాలు మంజూరు చేయటం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.గౌరునాయుడు, ఎపిఎం కె.రాము, హౌసింగ్ ఎఇ వి.వినోద్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ఎం.వసంత్ కుమార్, సచివాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల నియామకానికి నోటిఫికేషన్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆశా కార్యకర్తల నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్ భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలోని పేర్కొన్నారు. జిల్లాలో గ్రామీణ, గిరిజన గ్రామ సచివాలయల పరిధిలో ఆశా కార్యకర్తలుగా పనిచేసేందుకు నియామకాలకు ప్రభుత్వం అనుమతించిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 34 ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. ఆశా కార్యకర్తగా పనిచేసేందుకు సంబంధిత గ్రామ సచివాలయ పరిధిలో నివసించే స్త్రీ అయి ఉండాలన్నారు. వివాహితులు, వితంతువులు, విడాకులు తీసుకున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని ఆయన చెప్పారు. 25 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలని ఆయన చెప్పారు. ఆరోగ్య, సంక్షేమ, పారిశుధ్య, గర్భిణీ స్త్రీల ఆరోగ్యం వంటి సమస్యలపై అవగాహన, ఇతరులకు అవగాహన కల్పించే నాయకత్వ లక్షణాలు, సమస్యల పరిష్కారానికి తగు చొరవ, సానుకూల దృక్పథం కలిగివుండాలని ఆయన వివరించారు. కనీసం పదో తరగతి విద్యార్హత కలిగి ఉండాలని , తెలుగు బాగా చదవటం, రాయడం తప్పని సరిగా వచ్చి ఉండాలని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తును https://parvathipurammanyam.ap.gov.in వెబ్ సైట్ లో డౌన్లోడ్ చేసుకొని జూలై 5లోపు విద్యార్హతల నకలుతోపాటు సమర్పించాలని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తుతో తహశీల్దారు జారీ చేసిన నివాస ధ్రువీకరణ పత్రం (రేషన్ కార్డు / బిపిఎల్ కార్డు / వోటరు కార్డు / ఆధార్ కార్డు), 10వ తరగతి సర్టిఫికట్ కాపీని జత చేయాలని ఆయన కోరారు. గ్రామీణ, గిరిజన ప్రాంతం ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తులను సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి సమర్పించాలని ఆయన తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు : డిపిఒ

ప్రజాశక్తి - పాచిపెంట

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా మండలంలోని ప్రతి గ్రామంలో పారిశుధ్యం పనులు చేపట్టాలని డిపిఒ ఎం.నాగభూషణం పంచాయతీ గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు సక్రమంగా వసూలు చేయాలని, కొత్తగా నిర్మించిన భవనాలకు కూడా పన్నులు వసూలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పి.మల్లేశ్వరరావు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న డిపిఒ నాగభూషణం

మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

రేషనలైజేషన్‌లో మిగులు ఉద్యోగులకు క్లారిటీ ఇవ్వాలి

వార్డు సచివాలయ సిబ్బంది డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సచివాలయ ఉద్యోగులకు జాబ్ చార్ట్ ప్రకటించి, రేషనలైజేషన్‌లో మిగులు ఉద్యోగులకు క్లారిటీ ఇవ్వాలని మున్సిపాల్టీ పరిధిలో గల 15 సచివాలయాల ఉద్యోగులు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో గల కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మన్యం జిల్లాలోని వార్డు, గ్రామ సచివాలయ కార్యదర్శుల సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు బదిలీల ప్రక్రియ చేపట్టడం హర్షించదగిన విషయమే అయినప్పటికీ రేషనలైజేషన్‌కు సంబంధించి మిగుల ఉద్యోగులకు క్లారిటీ ఇవ్వాలని, ప్రమోషన్ కల్పించి బదిలీ ప్రక్రియ చేపట్టాలని, జాబ్ కార్డు ప్రకటించాలని, సచివాలయాల ఉద్యోగులకు ప్రమోషన్ ఛానళ్లను అన్ని డిపార్ట్మెంట్‌లకు కల్పించాలని, 9 నెలల ఏరియర్స్ తక్షణమే విడుదల చేయాలని, పెండింగ్ డిఎలు, నోషనల్ ఇంక్రిమెంట్లను ఇవ్వాలని, ఉద్యోగుల సమస్యలపై తక్షణమే కమిటీ వేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే సచివాలయాల శాఖకు చట్టబద్ధత కల్పించాలని, ఈ సమస్యలు పరిష్కరించి బదిలీలు ప్రక్రియ చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో 15 సచివాలయాల్లోని అన్ని విభాగాలు సెక్రటరీలు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగి నిజాయితీ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ఆర్‌టిసి డిపోకు చెందిన బస్సులో పొందూరు చెందిన ఎ.రమేష్ ఈనెల 24న విశాఖపట్నంలో బస్సు ఎక్కి పొందూరుకు టికెట్ తీసుకొని బస్సులోని పర్సు, ఎటిఎం కార్డు, రూ.4210 నగదు పోగొట్టుకున్నారు. అయితే ఆ పర్సన్, నగదు డ్రైవర్ కెజి రావు సిబ్బందికి అప్పజెప్పారు. దీంతో పర్సు పోగొట్టుకున్న రమేష్‌కు డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు బుధవారం అందించారు. అసిస్టెంట్ మెకానిక్ ఇంజనీర్ రాము, సెక్యూర్టీ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరరావు, బాసర కృష్ణమూర్తి, రాజేష్ ఉన్నారు.

కుట్టు శిక్షణను పరిశీలిస్తున్న ఎంపిడిఒ ప్రసాద్

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం

కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టుమిషన్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం బ్యాచ్‌ల వారీగా 90 రోజుల కుట్టు మిషన్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతగా 67 మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇదివరకే కుట్టు మిషన్ల శిక్షణ కార్యక్రమానికి బిసి కార్పొరేషన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారని ఆయన తెలిపారు.

రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను చూపుతున్న సిపిఎం నాయకులు

గుంతలను తక్షణమే కప్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి -కురుపాం

రహదారిపై ఏర్పడిన గుంతలను తక్షణమే సంబంధిత అధికారులు కప్పించాలని సిపిఎం మండల కార్యదర్శి కురంగి సీతారాం కోరారు. బుధవారం జియ్యమ్మవలస మండల కేంద్రంలో గల బస్ స్టాండ్ వద్ద ఏర్పడిన గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసలే వర్షాకాలంలో వర్షాలకు గుంతల్లో నీరు చేరి క్రిమి కీటకాలు చేరుతున్నాయని, దీనివల్ల ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయని అన్నారు. అంతేకాకుండా గుంతల్లో వాహనాలు దిగి ప్రమాదాలు సంభవించే పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కావున తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను కప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగు నీరందించండి

ప్రజాశక్తి - కురుపాం

స్వచ్ఛమైన తాగునీరందించాలని మండలంలోని ఉదయపురం గ్రామ గిరిజనులు కోరుతున్నారు. తమ గ్రామంలో గల తాగునీటి ట్యాంక్‌లు, పైపుల నుంచి పురుగులు, క్రిమి కీటకాలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. అసలే వర్షాకాలమని, ఇప్పటికే జ్వరాలు బారిన పడుతున్నామని, దీనికి తోడు తాగునీటిలో ఇలా క్రిములు, కీటకాలు రావడం వల్ల ఎక్కువమంది వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయని భయాందోళన వ్యక్తం చేశారు. కావున తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి తాగినీటి ట్యాంకులను పరిశుభ్రపర్చి స్వచ్ఛమైన తాగు నీరందించాలని కోరుతున్నారు.

మండలో డిఎ జుగా

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మండ గ్రామంలో జుగా కార్యక్రమం ఎంపిడిఒ బిబి మిశ్రో ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ సమస్యలు పరిష్కరించడానికి జుగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని అన్నారు. అందరికీ ఆధార్ కార్డులు, పెన్షన్లు వస్తున్నాయా అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఉంటే వినతులు ఇవ్వొచ్చని చెప్పారు. అనంతరం ప్రజల నుంచి సమస్యలు, వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ రామకృష్ణ, జెఇలు సిహెచ్ వెంకటేష్, సత్యం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఇఒ, తోటి ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని పివిఆర్ పురం గ్రామ మండల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న జంపు ఉమామహేశ్వరరావు, రఘుమండల ధనుంజయనాయుడు, సూర్య ప్రకాష్, మాధవరావు ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. దీంతో బుధవారం ఈ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంఇఒ-2 ఆర్.ఆనందరావు ఉపాధ్యాయులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆనందరావు మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకొని, ఉన్న సిబ్బంది విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి మెరుగైన విద్యను అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మరడాన సంపత్‌కుమార్, ఉపాధ్యాయులు సరస్వతి, లక్ష్మీ, జనార్ధన్‌రావు, సురేష్‌కుమార్, పద్మావతి, సిఆర్‌పి ఆర్.సంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.80వేలు జరిమానా

ప్రజాశక్తి -మక్కువ

మండలంలో పోలీసుల తనిఖీలు నిర్వహించగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 8 మందికి రూ.80వేలు జరిమానా సాలూరు కోర్ట్ న్యాయమూర్తి విధించినట్లు మక్కువ ఎస్ఐ ఎం.వెంకటరమణ తెలిపారు. మద్యం సేవించి ఎవరైనా వాహనాలు నడుపుతూ పట్టుబడితే ఇలా అపరాధ రుసుంతో పాటు శిక్షలు కూడా పడే అవకాశం ఉందని హెచ్చరించారు.

వన్ స్టాప్ సెంటర్ తనిఖీ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి టి.కనక దుర్గ పట్టణంలోని వన్ స్టాప్ సెంటర్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా సెంటర్‌లో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. వన్ స్టాప్ సెంటర్లో అందిస్తున్న సేవలు, సిబ్బంది పని తీరును పరిశీలించి వన్ స్టాప్ సేవలు తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో మహిళా భద్రత కోసం ఏర్పాటు చేస్తున్న ఐసిసి కమిటీల ఏర్పాటు గురించి అడిగి తెలుసుకున్నారు. వన్ స్టాప్ సెంటర్‌కు వచ్చిన బాధితులతో మాట్లాడి వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని కౌన్సిలర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సెంటర్ సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ గంగవంశం శాంతి కుమారి, కౌన్సిలర్ పల్లవి, కేసు వర్కర్లు భారతి, గౌరీ, నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఐసిడిఎస్ పీడీ కనకదుర్గ

డ్రగ్స్ రహిత సమాజానికి పాటుపడాలి

ప్రజాశక్తి - కురుపాం

డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి విద్యార్థి పాటు పడాలని డిసిపి యూనిట్ ఇన్చార్జి అనిల్, ఐసిడిఎస్ సూపర్వైజర్ వివి రమణమ్మ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సక్రమంగా చదువుకొని ఉన్నత స్థానంలో స్థిరపడాలని, మీ పరిసర గ్రామాల్లో గానీ, ఎక్కడైనా డ్రగ్స్ అమ్మినా ఎవరైనా యువత డ్రగ్స్‌కు బానిసైనా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు జె. సరోజ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాచిపెంట : మండలంలోని పి.కోనవలస బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు సిడిపిఒ బి.అనంతలక్ష్మి మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల జరిగే నష్టాలు గురించి అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశానికి యువతే బలమని, సమాజం, దేశ అభివృద్ధిలో యువత శక్తి ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని అన్నారు. కావున మాదకద్రవ్య రహిత భారతదేశ ప్రచారంలో గరిష్ట సంఖ్యలో యువత చేరడం చాలా ముఖ్యమన్నారు.

పాచిపెంటలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

కార్యక్రమంలో డిసిపిఒ అల్లు సత్యనారాయణ, ప్రిన్సిపల్ శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు

ఆర్‌ఒపై చర్యలు శూన్యం

- మున్సిపల్ ఉద్యోగినుల అసహనం
- నేడు విధులకు గైర్హాజరు, పెన్ డౌన్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఆర్ఒ డి.రూబెన్ తీరుకు నిరసనగా కార్యాలయంలో గల మహిళా ఉద్యోగినులతో పాటు, పలువురు ఉద్యోగులు మూడు రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లుకు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరికి ఫిర్యాదు చేశారు. ఆయనపై చర్యలు తీసుకోకపోతే తమ విధులను నిర్వహించలేమని వినతి పత్రం అందజేసిన విషయం తెలిసిందే. దీనిపై మున్సిపల్ చైర్‌పర్సన్ బుధవారం కార్యాలయానికి వచ్చి ఆర్ఒతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. అయితే ఆమె బుధవారం కార్యాలయానికి రాకపోవడంతో ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తూ గురువారం కమిషనర్‌తో పాటు తాము కూడా విధులు బహిష్కరించి, పెన్ డౌన్ కార్యక్రమం చేపడతామని బహిరంగంగా చెప్పడం గమనార్హం.

ఐదో తరగతి సీట్లు పెంచాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమం పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశానికి 80 నుంచి 120 వరకు సీట్లు పెంచాలని సిపిఎం నాయకులు కొల్లి సామామూర్తి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గిరిజన గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలు నుంచి తెలుసుకుని పలు సమస్యల్లో సీట్లు సరిపడక ఇంటర్ కోసం వేరొక కళాశాలకు వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. గిరిజన గురుకుల పాఠశాలలో ఇంటర్ కళాశాలలో అప్‌గ్రేడ్ చేయాలని పాలకులకు, ప్రభుత్వానికే విజ్ఞప్తి చేశారు. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 8 గిరిజన మండలాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలుర గురుకులం పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశానికి సీట్లు చాలక గిరిజన విద్యార్థులు చాలా ఇబ్బందిపడే పరిస్థితి ఉందని అన్నారు. కావున మరో 40 సీట్లు పెంచితే గిరిజన విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రామారావు, భాస్కరరావు, మిన్నారావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడండి

ప్రజాశక్తి - పాలకొండ

ప్రజా సమస్యలపై గళమెత్తాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు వైసిసి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సూచించారు. తాడేపల్లి జగన్‌ను బుధవారం పాలవలస కలిశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎప్పటికప్పుడు ఎండగొట్టాలన్నారు.అలాగే నిత్యం ప్రజల్లో ఉండే ప్రజా సమస్యలు పరిష్కరించేలా చూడాలని జగన్ సూచించినట్టు పాలవలస తెలిపారు.



జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ విక్రాంత్

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దా...

ప్రజాశక్తి- పార్వతీపురం

పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని పిల్లలు ఉన్నత చదువులు చదువుకొని, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పరితపించే ఉపాధ్యాయుల్లో ఉత్తమ ఉపాధ్యాయుడు చింతాడ విశ్వేశ్వరరావు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడారు. వివరాలు మరిన్ని ఆయన మాటల్లోనే..

చింతాడ విశ్వేశ్వరరావు

చింతాడ ముసలయ్య, అప్పలమ్మలు నా తల్లిదండ్రులు. బొబ్బిలి మండలం చింతాడలో 1963 జులై 1న జన్మించాను. మాది సాధారణ రైతు కుటుంబం. ప్రాథమిక విద్య స్వగ్రామంలో చదువుకొన్నాను. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉంటూ సీతంపేట ప్రభుత్వ హైస్కూల్లో చదువుకున్నాను. ఇంటర్ శ్రీకాకుళం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోనూ, డిగ్రీ బొబ్బిలి రాజా కాలేజీలో పూర్తి చేశాను. ఆంధ్రా యూనివర్సిటీలో బిఎల్, విజయనగరం ఎంఆర్ కాలేజీలో బిఇడి పూర్తి చేసిన తర్వాత అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఎంఎ ఇంగ్లీష్ కూడా చదివాను.

1996లో అప్పటి శ్రీకాకుళం జిల్లా వంగర మండలం కోణంగిపాడు మండల ప్రాథమిక పాఠశాల ఎస్‌జిటి ఉపాధ్యాయునిగా తొలి ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. ఇక్కడ స్థానికంగా ఉండి పిల్లలకు చదువు చెప్పే ఉపాధ్యాయుడు కరువై బడికి ఇద్దరు పిల్లలు మాత్రమే వచ్చే పరిస్థితి వుండేది. దీంతో నా మనసు చలించి స్థానికంగా ఉంటూ గ్రామస్తులతో కలిసిపోయి పిల్లలకు చదువు నేర్పుతాననే నమ్మకాన్ని కల్పించి వంద మంది పిల్లలు బడికి వచ్చేలా చేశాను. దీంతో అక్కడ పెద్దలు నివాసగృహం, పాలు, కూరగాయలు ఉచితంగా ఇవ్వడమే కాకుండా నలుగురు విద్యా వాలంటీర్లను కూడా అందించి ఎంతో ఆప్యాయంగా చూశారు. 2000లో బొబ్బిలి మండలం చెల్లివలస మారుమూల గిరిజన గ్రామానికి బదిలీ అయింది. అక్కడ గిరిజనులు తమ పిల్లలను బడికి పంపకుండా గొర్రెలు, మేకల పెంపకానికి తీసుకెళ్లే పరిస్థితి కనిపించింది. వారిలో ఒకడిగా కలిసిపోయి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయడంతో నమ్మకం కలిగించాను. 40 మంది పిల్లలు బడికి వచ్చేలా చేశాను. 2001లో బొబ్బిలి మండలం పాతపెంట యుపి స్కూల్‌కు బదిలీ అయింది. ఇక్కడ పాఠశాలను అభివృద్ధి చేస్తూ నా సొంత ఖర్చులతో ఏడుగురు వాలంటీర్లను నియమించి విద్యార్థుల హాజరు సంఖ్యను గణనీయంగా పెంచేందుకు కృషి చేశారు. దీంతో 200మంది విద్యార్థులను పెంచడంతో తన హయాంలో హైస్కూల్‌గా అప్ గ్రేడ్ చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. 2003లో కొమరాడ మండలం కోదులగుంప ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయింది. ఇక్కడ రాష్ట్రంలో బెస్ట్ స్కూల్ అవార్డు పొందడం సంతోషాన్నిచ్చింది. 2011లో అదే మండలం గుణానపురం ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చాను. ఇక్కడ పని చేస్తూ డెప్యుటేషన్‌పై నాలుగేళ్లు జిల్లా సెంటర్ ఫర్ ఇంగ్లీష్ (డైట్) లెక్చరర్‌గా పనిచేశాను. 2017లో నర్సిపురం రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చి నేడు ఉద్యోగ విరమణ వరకు విధులను నిర్వహిస్తున్నాను. ఇక్కడ 60 మంది విద్యార్థుల నుంచి 140 మందికి పెంపుదల చేస్తూ తమ సొంత డబ్బులతో పాఠశాల సమయం తర్వాత నిరుద్యోగులతో పిల్లలకు ట్యూషన్ కూడా ఏర్పాటు చేశాను.

తాను ఇంటర్ శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీ లోనూ, ఆ తర్వాత ఆంధ్రా యూనివర్సిటీ చదువుల్లో మాజీ డిప్యూటీ సిఎం పీడిక రాజన్న దొర కలిసి చదువుకున్నాం. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలనే తపనతో పనిచేశాను. ఏనాడూ అవార్డుల కోసం పాకులాడలేదు. భార్య భానుమతి పార్వతీపురం మున్సిపల్ టీచర్‌గా పనిచేస్తూ తనకు విధినిర్వహణలో, సామాజిక సేవా దృక్పథంతో పని చేయడంలో ఎంతగానో సహకరించారు. కుమారుడు హర్షవర్ధన్ ఖరగ్‌పూర్ ఐఐటిలో ఎంటెక్ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో పడ్డారు. కుమార్తె హరిప్రియ బిఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేశారు. ఉద్యోగ విరమణ తర్వాత న్యాయవాదిగా సేవలందిస్తాను. అంబేద్కర్ ఆశయాల గురించి అవగాహన కల్పిస్తాను.

విత్తనాల కొరత లేదు : జిల్లా వ్యవసాయధికారి

ప్రజాశక్తి - సీతంపేట

ఈ ఖరీఫ్ సీజన్లో రైతులకు విత్తనాల కొరత లేదని జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్ అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారులు, విఎఎలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 10 రకం 45 క్వింటాలు వచ్చాయని, 62 క్వింటాలు పచ్చిరొట్ట విత్తనాలు తెప్పించామని తెలిపారు. ఇప్పటికే మరో 250 క్వింటాలకు విత్తనాలు అవసరమని ప్రతిపాదనలు పంపించామన్నారు. ఎక్కడెక్కడ ఎంత వచ్చాయి, ఎంత అవసరమో విఎఎలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు, సందేశాలు ఉంటే తమను సంప్రదించాలని, రైతులకు అందుబాటులో ఉండి అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఎడిఎ కె.రత్నకుమారి, ఎఒ వై.వాహిని తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్ సీడ్ విధానంతో అధిక దిగుబడులు

సీతానగరం: డ్రమ్‌సీడ్ విధానంతో రైతులకు అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ అన్నారు. మండలంలోని లచ్చయ్యపేట, బూర్జ గ్రామాల్లో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరుగా భూములోకి వరి విత్తనాలు మొలకెత్తడానికి అనువుగా ఉంటుందన్నారు. అలాగే పెట్టుబడులు తక్కువ అవుతాయని ఆయన తెలిపారు. రైతులకు కావాల్సిన ఎరువులు డిఎపి, యూరియా

సీతానగరం : డ్రమ్‌సీడర్ విధానంపై అవగాహన కల్పిస్తున్న ఎఒ అవినాష్

రైతు కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు

కురుపాం : ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయన్ని సాగు చేయాలని, ఈ విధానం రైతులకు ఎంతో ప్రయోజనమని జియ్యమ్మవలస మండల వ్యవసాయ అధికారి ఆర్.విజయభారతి అన్నారు. మండలంలోని శిఖబడిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు బీజామృతంతో విత్తన శుద్ధి, పంటల దిగుబడులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బీజామృతంతో విత్తన శుద్ధి, పంటల దిగుబడులకు అమృతం వలె పనిచేస్తుందని, వర్షాలు పడుతున్నందున రైతులు తమ విత్తనాలను విత్తేటప్పుడు ఏ విధమైన తెగుళ్లు సోకకుండా బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకోవడం వల్ల గాలి, నీటి ద్వారా సంక్రమించే హానికర సూక్ష్మజీవుల నుంచి రక్షణ పొందడం జరుగుతుందని అన్నారు. కావున రైతులంతా సంబంధిత రైతు సేవా కేంద్రం వద్ద బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకుని తమ వ్యవసాయ క్షేత్రాల్లో వేసుకొని అధిక ప్రయోజనం, దిగుబడి పొందాలని అన్నారు. కార్యక్రమం ఎన్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ, మాస్టర్ ట్రైనర్ శ్రీరామ్, సిబ్బంది ధనుంజయ, స్వామి నాయుడు, శ్యామల రైతులు పాల్గొన్నారు.

యంత్రాలతో కలుపు నివారణ ఉత్తమం

పాచిపెంట : కలుపు మందులు వాడే కంటే కూలీలతో గానీ, యంత్రాల సాయంతో గాని కలుపు నివారణ చేసుకోవడం ఉత్తమమని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని రాయిగుడ్డివలసలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతు లక్ష్మణరావు పొలంలో పవర్ వీడర్ ఉపయోగాలను రైతులకు వివరిస్తూ ప్రతి రైతు తప్పనిసరిగా పవర్ వీడర్ కొనుగోలు చేసుకోవాలని, పత్తి, మొక్కజొన్న వంటి పంటల మధ్య కలుపు నివారణకు ఎంతగానో సహకరిస్తుందని అన్నారు. అలాగే బహుళార్ధ సాధక ప్రయోజనాలు కలిగి ఉందన్నారు. కలుపు రసాయనాలు అధికంగా వాడడం వల్ల భూమి ఆరోగ్యం దెబ్బతింటుందని, దగ్గరలో ఉన్న నీటి కుంటలను కలుషితం చేస్తాయని అన్నారు. కావున యంత్ర సహాయంతో దుక్కి దున్నడం వల్ల కలుపు నశించడమే కాకుండా ఎరువుగా మారుతుందని తెలిపారు. అనంతరం డిఎ జుగా

వ్యవసాయాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి రాబర్ట్‌పాల్

సమావేశంలో పాల్గొని ఎంపిడిఒ జగన్నాథ పాత్రో చేతుల మీదుగా కంది విత్తనాలను రైతులకు అందజేశారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి మళ్లించి కొంత విస్తీర్ణంలో అయినా ప్రకృతి సాగు చేపట్టాలని రైతులకు ఎంపిడిఒ సూచించారు. కార్యక్రమంలో విఎఎ సాయి గణేష్, ప్రకృతి సేద్య ప్రతినిధులు సూర్యారావు, సుకరమ్మ, గ్రామ పెద్దలు కంఠం దొర, రైతులు పాల్గొన్నారు.

పచ్చి రొట్టె విత్తనాలతో భూసారం

వీరఘట్టం: పచ్చి రొట్టి విత్తనాలతో భూసారం అభివృద్ధి చెందుతుందని మండల వ్యవసాయాధికారి జె.సౌజన్య రైతులకు సూచించారు. మండలంలోని కిమ్మి, చిట్టిపూడివలసలో ఏర్పాటు చేసిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో మాట్లాడారు. భూసారం అభివృద్ధితో పాటు పంట దిగుబడి కూడా బాగా వస్తుందన్నారు. బీజామృతం ద్వారా విత్తనాలను శుద్ధి చేసుకునే విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో విఎఎలు చిన్నారావు, అరవింద్, రైతులు పాల్గొన్నారు.

బీజామృతంపై అవగాహన కల్పిస్తున్న ఎఒ విజయభారతి

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య?

ఆలస్యంగా వెలుగులోకి ..ప్రేమ విఫలమే కారణమా?

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రంలోని కొట్టక్కి వట్టి గెడ్డ బ్రిడ్జి సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని ఒక యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. సాలూరు మండలం జీగిరాం గ్రామానికి చెందిన నులక ప్రశాంతకుమార్ (26) ఈ నెల 5వ తేదీన ఇంటి నుంచి బ్యాగుతో బయటకు వచ్చాడు. అప్పటి నుంచి కనబడక పోవడంతో అతని తల్లిదండ్రులు సాలూరు పోలీసు స్టేషన్లో ఆచూకి కోసం ఫిర్యాదు చేశారు. ప్రశాంత్‌కుమార్‌కు వివాహం కాగా భార్యతో విడిపోయి ఉంటున్నాడు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడు లారీ క్లీనర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజూ మద్యం సేవించి రావడంతో తల్లి వసంత మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడని, ఆ క్రమంలో చెట్టుకు షర్టుతో ఉరివేసుకొని మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. చనిపోయే ముందు పాలకొండలో ఉన్న తన ప్రియురాలితో ఆఖరిగా సంభాషించి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపాడని తెలిసింది. ఇతను చనిపోయి సుమారు 20 రోజులు కావడంతో మృతదేహం పూర్తిగా కుళ్లిపోయింది. సంఘటనా స్థలం వద్దే బాడంగి వైద్యాధికారి నాగేశ్వరరావు పోస్టుమార్టం నిర్వహించారు. కొట్టక్కి విఆర్వో కిలపర్తి మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. భార్యతోపాటు పిల్లలు కూడా ఆమె వెంటే వెళ్లిపోవడంతో మానసికంగా విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్టు బావిస్తున్నారు. సంఘటనా స్థలం వద్ద తల్లి వసంత, తండ్రి బాలరాజు, బంధువులు బోరున విలపించారు. బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరువాడ వద్ద ఏనుగుల సంచారం

ప్రజాశక్తి -వంగర

మండలంలోని పాత మరువాడ సమీపంలోని కొండ ప్రక్కన గజరాజుల గుంపు బుధవారం హల్ చల్ చేశాయి. తెర్లాం మండలం మీదుగా వచ్చిన గజరాజులు మండలంలోని మరువాడ కొండ ప్రాంతానికి ప్రవేశించాయి. 9 ఏనుగులు ప్రధాన రోడ్డు పక్కన ఉన్న కొండ ప్రాంతంలో సంచరించడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడ్డారు. గతంలో వచ్చిన ఈ గజరాజులు గుంపు మండలంలోని శ్రీహరిపురం, నీలయ్యవలస, బాగంపేట సంగాం, శివ్వాం తదితర గ్రామాల్లో సంచరించి చెరకు, వరి , మొక్కజొన్న పంటలను ధ్వంసం చేశాయి. పశువులపై దాడి చేశాయి. తాజాగా ఇప్పుడు మండలంలోకి ప్రవేశించాయి.

గిరిజన సంక్షేమ అధికారికి వీడ్కోలు

ప్రజాశక్తి -పార్వతీపురం

ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా విశాఖపట్నం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా బదిలీపై వెళ్తున్న గుమ్మలక్ష్మీపురం సహాయ గిరిజన సంక్షేమ అధికారి బి.సురేష్ కుమార్‌కు పలువురు గిరిజన సంఘాల నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో సురేష్ కుమార్ గిరిజన విద్యాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పల్లా సురేష్, గిరిజన అభ్యుదయ సంఘం నాయకులు ఆరిక చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను

అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యలపై అవగాహన

-: విలేకరులు కావాల్సిన ప్రాంతాలు :-

గరివిడి, జామి, కొత్తవలస రూరల్, జియ్యమ్మవలస, సాలూరు, పార్వతీపురం రూరల్, బలిజిపేట రూరల్

ఇంటర్వ్యూ : తేది: 04-07-2025 శుక్రవారం ఉదయం 10 గంటలకు

సంప్రదించాల్సిన ఫోన్ నెంబరు :

9490099164, 9490099156, 8331011960

ప్రజాశక్తి కార్యాలయం

అశోక్ బంగ్లా ఎదురుగా, ఆర్ అండ్ బి జంక్షన్, విజయనగరం

IN THE HONOURABLE COURT OF THE 3RD ADDITIONAL DIST CIVIL JUDGE AT SRIKAKULAM
E.P.300/2024 in A.R.C. No. 1383/2022

Between: **M/S Five Star Business Finance Limited, Represented by Legal Manager G.S. Robert rept by its Claimant M. Jayendra Patnaik** ....Award Holder
And: **Patrayuni Anuradha Gayatri Moonstar & another** ......Judgment Debtors

NOTICE OF SALE (Order 21 Rule 64 C.P.C.)

To,
1) Patrayuni Anuradha Gayatri Moonstar, W/o Suryanarayana, Aged 41 years, D.No. 5-565, Nagavamsapu Street, Palakondla Town & Mandal, Srikakulam Dist

Please take notice that the petitioner/D.Hr filed above EP against the 1st Jdr for the sale of schedule property, and the above matter is stands posted to **27-06-2025** for your appearance for settling the terms of proclamation of sale, and you are to appear on aforesaid date before the Honourable 3RD Additional District Judge, Srikakulam at about **10.30 A.M** in person or through pleader, otherwise the above matter will decide against you. Hence this Notice.

PETITION SCHEDULE:
Srikakulam District, Palakonda Mandal, Palakonda Gramapanchayat & Village, Ward no. 5, S.No. 480/1, an extent 38.25 Sq. yards land
Measurements of Property:
East to west : 10.75 feet
North to South : 32 feet (an extent of 38.25 Sq. Yards)
Boundaries of the Property:
East:- ACC house of Ommi Pydiraju
West:-Yenninti Saraswathi Nadaka Dari
South: Road
North: RCC House of Yenninti Jyothi

SAKALABHAKTULA SAIKISHORE
Advocate for Petitioner,
Srikakulam, Cell: 9493659846